

సేంద్రియ సేద్యం
ప్రస్తుతం రైతులు సంప్రదాయ పద్ధతులకు స్వస్తి పలికి సేంద్రియ సాగు వైపు అడుగులు వేస్తున్నారు. 8లో▸



యథేచ్ఛగా భూ కబ్జా!
అది ప్రభుత్వ భూమి.. అందునా గజం రూ. లక్షల్లో ధర పలుకుతోంది. దీంతో ఆ భూమిపై అక్రమార్కుల కన్ను పడింది. 8లో▸



ఆక్రమణల అంతు తేలుస్తాం
అనుమతులు లేకుండా కొనసాగిస్తున్న నిర్మాణాల అంతు తేలుస్తామని మున్సిపల్ అధికారులు హెచ్చరించారు. 8లో▸

న్యూస్‌రీల్

సీఎం రేవంత్‌ను కలిసిన ఎమ్మెల్యే కసిరెడ్డి



ఆమనగల్లు: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని గురువారం కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. జూబ్లీహిల్స్‌లోని సీఎం నివాసంలో కలిసిన కసిరెడ్డి నియోజకవర్గ అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు.

మొక్కలు సిద్ధం చేయాలి
డీపీఓ సురేశ్ మోహన్



పల్లె ప్రకృతి వనాన్ని పరిశీలిస్తున్న డీపీఓ సురేశ్ మోహన్

కడ్తాల్: హరితహారానికి మొక్కలు సిద్ధం చేయాలని, నీటి ఇబ్బందులు తలెత్తకుండా దృష్టి సారించాలని జిల్లా పంచాయతీ అధికారి సురేశ్ మోహన్ అన్నారు. మండల పరిధిలోని అన్మాస్‌పల్లి గ్రామంలో గురువారం ఆయన పర్యటించారు. గ్రామ శివారు పిరమిడ్ సమీపంలో ఏర్పాటు చేసిన గ్రీన్‌ఎర్త్ షెల్టర్ వెంచర్‌లో అభివృద్ధి పనులను పరిశీలించారు. 2008లో ఏర్పాటు చేసిన 25 ఎకరాల అనధికార లేఅవుట్‌పై వచ్చిన ఫిర్యాదు మేరకు, ఆ వెంచర్‌ను సైతం పరిశీలించారు. వెంచర్‌లో చేపట్టిన ఇళ్ల నిర్మాణాలు, అనుమతులపై ఆరా తీశారు. అనంతరం అన్మాస్‌పల్లి పంచాయతీ కార్యాలయాన్ని సందర్శించారు. కంపోస్టు షెడ్డు, వైకుంఠధామం, నర్సరీలో మొక్కల పెంపకం, పల్లె ప్రకృతివనం, క్రీడా ప్రాంగణాలను పరిశీలించారు. తడిపొడి చెత్త సేకరణ తదితర పనులు సక్రమంగా నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో డీటీసీపీ అధికారి సువర్ణ, ఎంపీవో మధుసూదనాచారి, కార్యదర్శి హరిశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నూతన చట్టాలు అంతర్గత భద్రతకు మైలురాయి
రాచకొండ సీపీ తరుణ్ జోషి



మాట్లాడుతున్న రాచకొండ సీపీ తరుణ్ జోషి

పహాడీషరీఫ్: త్వరలో అమలులోకి రానున్న నూతన చట్టాలు మన దేశ శాంతి భద్రతల పరిరక్షణలో ఒక మైలురాయిగా నిలుస్తాయని రాచకొండ పోలీస్ కమిషనర్ తరుణ్ జోషి అన్నారు. జూలై 1వ తేదీ నుంచి భారత ప్రభుత్వ నూతన నేర న్యాయ చట్టాలు అమలులోకి రానున్న నేపథ్యంలో పలు కేసుల దర్యాప్తు, విచారణలో పాటించాల్సిన నూతన విధానాలపై సిబ్బందికి సంపూర్ణ పరిజ్ఞానం కలిగించేందుకు ఆర్‌సీఐలో గురువారం శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. రిటైర్డ్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ రాములు ఈ సందర్భంగా నూతన చట్టాలపై సిబ్బందికి అవగాహన కల్పించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాచకొండ సీపీ తరుణ్ జోషి మాట్లాడుతూ.. నూతన చట్టాలతో కేసుల దర్యాప్తు విధానాలు, విచారణ పద్ధతుల్లో మార్పు వస్తుందన్నారు. సమావేశంలో మహేశ్వరం డీసీపీ సునీతా రెడ్డి, ఏసీపీ పి.లక్ష్మీకాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సర్వత్రా.. స్థానిక చర్చ

స్థానిక సంస్థల ఎన్నికలపై దృష్టి
- చర్చనీయాంశమైన రిజర్వేషన్ల అంశం
- గ్రామాల్లో ఎక్కడ చూసినా ఇవే మాటలు
- ఆశావహుల్లో ఎడతెగని ఉత్కంఠ
- ప్రభుత్వం ఇచ్చే స్పష్టత కోసం ఎదురుచూపులు



చేవెళ్ల: ఇటీవల ముగిసిన లోక్‌సభ ఎన్నికల వాతావరణం నుంచి బయటకు వచ్చిన పలు రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు ఇక గ్రామాల్లో వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలపై దృష్టి పెట్టారు. త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికలపై గ్రామాల్లో జోరుగా చర్చ సాగుతోంది. ఏ పార్టీ నాయకుల నోట విన్నా రిజర్వేషన్లు ఎలా ఉండబోతున్నాయి అన్న మాటే వినిపిస్తోంది. రిజర్వేషన్లు మారుతాయా లేదా పాత వాటినే కొనసాగిస్తారా అనేది ప్రస్తుతం స్థానిక సంస్థల్లో పోటీ చేసేందుకు సిద్ధమవుతున్న నాయకుల్లో గుబులు రేపుతున్న ప్రశ్నలు. జిల్లాలోని ఏగ్రామంలో చూసినా వీటిపైనే చర్చ జరుగుతోంది.

ఎవరికి వారు అంచనాలు

లోక్‌సభ ఎన్నికలు ముగిసిన వెంటనే స్థానిక సంస్థల ఎన్నికలు ఉంటాయని స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి లోక్‌సభ ఎన్నికల ప్రచారాల్లో ప్రకటించిన విషయం తెలిసిందే. మరోవైపు బీసీ రిజర్వేషన్లు పెంచుతామనే ప్రకటన కూడా రావడంతో ఇప్పటికే స్థానిక సంస్థలకు పోటీ చేసేందుకు సిద్ధమైన నాయకుల్లో భయం పట్టుకుంది. కాంగ్రెస్ ప్రభుత్వం రిజర్వేషన్లపై ఎలాంటి నిర్ణయం తీసుకుటుందోనని ఆలోచనలో పడ్డారు. కాంగ్రెస్ పార్టీ నాయకులతోపాటు ఇతర పార్టీల నాయకులు సైతం రిజర్వేషన్లు ఎలా ఉండబోతున్నాయని చర్చించుకుంటున్నారు. ఎవరికి వారు అంచనాలు వేసుకుంటున్నారు. పాత రిజర్వేషన్ల ప్రకారమే వస్తే స్వయంగా.. కొత్తగా మారితే మరొకరు ఉండాలనే ఆలోచనతో కూడా నాయకులు చర్చలు సాగిస్తున్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో పదేళ్ల అవే రిజర్వేషన్లు ఉంటాయని ప్రకటించటంతో గ్రామాల్లో గతంలో హడావుడి చేసిన నాయకులు ప్రభుత్వం నుంచి స్పష్టత రానీ అప్పుడు ఆలోచన చేద్దామని అంటున్నారు. బీసీ రిజర్వేషన్లు పెంచుతామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ అమలు చేస్తుందా.. అమలు చేస్తే ఎలాంటి మార్పులు చోటు చేసుకుంటాయనే ప్రశ్నలు ఉద్భవిస్తున్నాయి. బీసీ రిజర్వేషన్లు పెంచాలంటే తప్పనిసరిగా బీసీ గణన చేస్తే గానీ స్పష్టత రాదని.. అప్పటి వరకు రిజర్వేషన్లు పెంచే అవకాశం ఉండకపోవచ్చనే వాదన కూడా వినిపిస్తోంది.

స్థానిక సంస్థల చర్చలే ప్రధానాంశం

జిల్లాలోని ఏ గ్రామంలో చూసినా ఇప్పుడు ఆయా పార్టీల నాయకులు మా పార్టీలో మా వర్గం నుంచి పలనా వ్యక్తి సర్పంచ్ అభ్యర్థి, పలానా వ్యక్తి ఎంపీటీసీ అభ్యర్థి అన్న మాటలే వినిపిస్తున్నాయి. వేసవి కాలం కావడం, రియల్ ఎస్టేట్ వ్యాపారం మందగించడంతో నాయకులు, కార్యకర్తలంతా ఖాళీగానే ఉన్నారు. వీరంతా ఇప్పుడు స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడు వస్తాయా అని.. వస్తే ఎలా వ్యవహరించాలనే దానిపై ఆలోచనలో పడ్డారు. ఎప్పుడైనా స్థానిక నగరా మోగే అవకాశం ఉండటంతో ఇప్పటి నుంచే వారు సన్నద్ధం అవుతున్నారు. అంతే కాదు రిజర్వేషన్ల ప్రకారం కూడా జనరల్ అయితే ఒకరు ఎస్సీ, బీసీ అయితే వారి పార్టీలోని ఆయా కులాలకు చెందిన వారు ఉంటారనే అంచనాలకు వస్తున్నారు. సోషల్ మీడియాలో రోజుకోరకంగా వస్తున్న పోస్టులతో మరింత చర్చ జరుగుతోంది. ఈ క్రమంలో ప్రభుత్వం నుంచి స్పష్టమైన ప్రకటన వచ్చే వరకు వేచి చూడాల్సిందే.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శశాంక

నకిలీ విత్తనాలపై ఉక్కుపాదం

కలెక్టర్ శశాంక

ఇబ్రహీంపట్నం రూరల్: నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు తప్పవని కలెక్టర్ శశాంక హెచ్చరించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో గురువారం వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఖరీఫ్ సీజన్‌ను దృష్టిలో పెట్టుకొని జిల్లాలో నకిలీ విత్తనాలు చెలామణి కాకుండా ఉక్కుపాదంతో అణచివేయాలని ఆదేశించారు. రైతుల ప్రయోజనాలు కాపాడడమే పరమావధిగా అంకితభవంతో కృషి చేయాలని అన్నారు. వానాకాలం సాగుకు సంబంధించి సుమారు 4,45,428 హెక్టార్ల విస్తీర్ణంలో పంటలకు అవసరమైన ఎరువులు, విత్తనాల కొరత తలెత్తకుండా ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలని సూచించారు. నకిలీ, నాసిరకం విత్తనాలతో రైతులు నష్టపోకుండా చూడాలన్నారు. ఇతర ప్రాంతాల నుంచి మన జిల్లాలోకి నకిలీ రాకుండా అడ్డుకట్ట వేయాలన్నారు. పోలీస్ శాఖ అధికారులతో కూడిన టాస్క్‌ఫోర్స్ బృందాలు నిరంతరం నిఘా కొనసాగించాలన్నారు. పదేపదే నకిలీ విత్తనాల దందాను నిర్వహించే వారిని గుర్తిస్తూ, అవసరమైతే పీడీ యాక్టు కేసులు పెట్టాలని సూచించారు. నకిలీ విత్తనాల కేసులతో సంబంధం కలిగి ఉన్న పాత నేరస్తులను తహసీల్దార్ల ఎదుట బైండోవర్ చేయాలన్నారు. సమావేశంలో జిల్లా వ్యవసాయాధికారి గీతారెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

రైతులకు అన్ని వసతులు కల్పించండి

అబ్దుల్లాపూర్‌మెట్: ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు కావాల్సిన అన్ని వసతులు సమకూర్చాలని కలెక్టర్ శశాంక్ అధికారులను ఆదేశించారు. మండల పరిధిలోని బాచారంలో కొనసాగుతున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సదుపాయాలను పరిశీలించారు. ఏమైనా ఇబ్బందులున్నాయా అని రైతులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. రైతులు ధాన్యం తెచ్చిన వెంటనే తూకం జరిపించడంతో పాటు సేకరించిన ధాన్యాన్ని వెంటనే లారీల్లో లోడ్ చేయించాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల వద్ద సరిపడా సంఖ్యలో హమాలీలు ఉండేలా ఏర్పాట్లు చేయాలన్నారు. జాప్యానికి తావులేకుండా ఎప్పటికప్పుడు ధాన్యం నిల్వలను తరలించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వం ప్రకటించిన మేరకు పూర్తి స్థాయిలో మద్దతు ధర చెల్లించడం జరుగుతుందని కలెక్టర్ స్పష్టం చేశారు. కేంద్రాల్లో ఎక్కడైనా ఇబ్బందులు ఎదురైతే రైతులు నేరుగా జిల్లా అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. ధాన్యం సేకరణ ప్రక్రియలో క్షేత్రస్థాయి సిబ్బంది నుంచి అధికారుల వరకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు. కలెక్టర్ వెంట డీసీఓ ధాత్రిదేవి, జిల్లా సివిల్ సప్లయ్ అధికారి మనోహర్ కుమార్ రాథోడ్, సివిల్ సప్లయ్ డీఎం విజయలక్ష్మి, అబ్దుల్లాపూర్‌మెట్ తహసీల్దార్ రవీందర్ దత్తు తదితరులు ఉన్నారు.

మా ఇంటి పచ్చడి



మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా రెడ్డి గురువారం శ్రీనగర్ కాలనీలోని తన నివాసంలో మామిడికాయ పచ్చడి తయారు చేశారు. ప్రతి ఏడాదిలాగే ఈసారి కూడా పచ్చడి తయారు చేసినట్టు ఆమె తెలిపారు.
– మహేశ్వరం

‘ఆదర్శం’గా పూర్తి చేయండి

- అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్
- ఎంపికైన అమ్మ ఆదర్శ పాఠశాలల పరిశీలన

కడ్తాల్: ఈ విద్యా సంవత్సరం ప్రారంభమయ్యేలోపు అమ్మ ఆదర్శ పాఠశాలల అభివృద్ధి పనులు పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ అన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాలల్లో భాగంగా ఎంపికైన మండల పరిధిలోని వాస్‌దేవ్‌పూర్ ప్రాథమికోన్నత పాఠశాలను గురువారం ఆమె సందర్శించారు. పాఠశాలలో జరుగుతున్న అభివృద్ధి పనులను ఇంజనీరింగ్ బృందం అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పాఠశాలల్లో మరుగుదొడ్లు, విద్యుత్, తాగునీరు తదితర మౌలిక వసతులు కల్పించడం జరుగుతుందని తెలిపారు. పనులు వేగవంత చేసి సకాలంలో పూర్తి చేసేలా అధికారులు పర్యవేక్షించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాస్‌రెడ్డి, డీఈ శ్రీనివాస్, ఏఈ పరమేశ్, ఎంఈవో సర్దార్‌నాయక్, నోడల్ అధికారి జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

గడువులోపు పూర్తి కావాలి

మాడ్గుల: అమ్మ ఆదర్శ పాఠశాల పనులను త్వరగా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్ అధికారులను ఆదేశించారు. మండల పరిధిలోని గిరికొత్తపల్లి పాఠశాలను గురువారం ఆమె పరిశీలించారు. విద్యుత్, వైరింగ్, నల్లాల ఏర్పాటు పనులను వెంటనే పూర్తి చేయాలని సూచించారు. గడువులోగా పనులు పూర్తి చేసి విద్యార్థులకు ఆటంకం లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాస్‌రెడ్డి, మండల విద్యాధికారి సర్దార్ నాయక్, ఎంపీడీఓ సూర్యవంశీ, ఎంపీడీవో సరస్వతి తదితరులు పాల్గొన్నారు.



కడ్తాల్: అభివృద్ధి పనులపై అధికారులకు సూచనలిస్తున్న అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్

స్వల్ప పెట్టుబడి.. అధిక రాబడి



ఆయిల్‌పామ్ సాగుతో ఎక్కువ లాభాలు

- మొక్కలు నాటిన నాలుగేళ్ల నుంచి దిగుబడి
- అంతర పంటల సాగుతో అదనపు ఆదాయం
- జిల్లాలో సాగు లక్ష్యం 5,500 ఎకరాలు
- రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

షాద్‌నగర్: వంట నూనెల వినియోగం రోజురోజుకూ పెరిగిపోతున్న నేపథ్యంలో సిరులు కురిపించే ఆయిల్‌పామ్ సాగు వైపు ప్రభుత్వం రైతులను ప్రోత్సహిస్తోంది. ప్రతికూల వాతావరణం ఉన్నా ఢోకా లేని పంట ఏదైనా ఉందంటే అది ఆయిల్ పామ్. రైతుకు లాభాలను తెచ్చి పెట్టే పంట కూడా ఇదే. జిల్లాలో ఆయిల్ పామ్ సాగును పెంచేందుకు అధికారులు ప్రత్యేకంగా దృష్టి సారించారు. ఈసారి 5,500 ఎకరాల్లో పంట సాగయ్యేలా చూడాలని లక్ష్యాన్ని నిర్దేశించుకున్నారు. ఇప్పటి వరకు సుమారు 680 మంది రైతులు మూడువేల ఎకరాలకు పైగా సాగు చేసేందుకు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. 330 ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగుకు ప్రభుత్వం అనుమతించడంతో మొక్కలు నాటారు. ఈ పంట సాగుకుపై రైతులకు అధికారులు గ్రామాల్లో విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నారు.

ప్రభుత్వం నిర్ణయించిన ధర

మొక్క నాటిన సంవత్సరం నుంచి నాలుగేళ్ల తర్వాత గెలలు వేస్తూ దిగుబడి ప్రారంభమవుతుంది. 30 ఏళ్ల వరకు దిగుబడి వస్తుంది. ఎకరాకు సుమారు 10 నుంచి 12 టన్నుల గెలలు వస్తాయి. సగటున ఒక టన్ను గెల ధర రూ.10వేల వరకు ఉంటుంది. ఇలా రైతు ఏడాదికి ఒక ఎకరానికి లక్ష రూపాయల ఆదాయం పొందొచ్చు. పంటను జిల్లా అనుబంధ పరిశ్రమ ఎంఎస్ వాల్యూ ఆయిల్ అండ్ గ్యాస్ వారు ప్రభుత్వం నిర్ణయించిన ధరకు కొనుగోలు చేస్తారు.

పంట సాగుకు రాయితీలు ఇలా..

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆయిల్‌పామ్ సాగు కోసం రాయితీలను అందజేస్తున్నాయి. మొక్కలు, డ్రిప్ పరికరాలు, ఎరువులు, యాజమాన్య పద్ధతుల కోసం రూ.50వేలు రాయితీ ఇస్తున్నాయి. మొక్కల కోసం రూ.11,600, డ్రిప్ కోసం రూ.22,518 రాయితీ అందజేస్తున్నాయి. మొదటి నాలుగేళ్ల పాటు ఎకరం భూమిలో అంతర పంటల కోసం రూ.2,100, యజమాన్య పద్ధతులు, ఎరువుల కోసం రూ.2,100 రైతు ఖాతాలో డబ్బులు జమ చేస్తాయి. కేంద్ర ప్రభుత్వం 60 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం నిధులను కేటాయిస్తున్నాయి.

సబ్సిడీపై డ్రిప్

ఆయిల్ పామ్ సాగు చేసే ఎస్సీ, ఎస్టీ రైతులకు డ్రిప్ పరికరాల కోసం వందశాతం సబ్సిడీని ప్రభుత్వం ఇస్తోంది. బీసీ రైతులకు 90, ఇతరులకు 80 శాతం రాయితీపై డ్రిప్ పరికరాలను అందజేస్తోంది. ఇందులో చిన్న, సన్నకారు రైతులు, దివ్యాంగులకు తొలి ప్రాధాన్యం ఇస్తున్నారు.

మూస పద్ధతికి స్వస్తి

రైతులు మూస పద్ధతికి స్వస్తి పలికి ప్రత్యామ్నాయ పంటల వైపు అడుగులు వేయాలని అధికారులు సూచిస్తున్నారు. ఆయిల్‌పామ్ సాగుకు ఒకసారి పెట్టుబడి పెడితే 20 ఏళ్ల పాటు ఆదాయం వస్తుంది. ఈ పంట చేతికి రావాలంటే నాలుగేళ్ల సమయం పడుతుంది. అప్పటి వరకు బొప్పాయి, అరటి, టమాటా, క్యాబేజీ, సొరకాయ, బీర, జామ, మామిడి, సపోట, వంకాయ తదితర పంటలను సాగు చేయొచ్చు. అంతర పంటల సాగుతో రైతులు ఆర్థికంగా బలపడొచ్చు. ఒక ఎకరం వరి సాగుకు అవసరమయ్యే నీటితో సుమారు 4 ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు చేయొచ్చని అధికారులు సూచిస్తున్నారు.



ఆయిల్‌పామ్ పంటను పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్)

లాభదాయకం



ఆయిల్‌పామ్ సాగు రైతులకు ఎంతో లాభదాయకం. ఈ పంట సాగుకు ప్రభుత్వం ప్రోత్సహిస్తూ పెద్ద ఎత్తున రాయితీలు ఇస్తోంది. పంట దిగుబడిని మార్కెటింగ్ చేయడం ఎంతో సులభం. రైతులు ఆయిల్‌పామ్ సాగుపై దృష్టి సారించాలి.
– ఉషారాణి, ఉద్యానవనశాఖ అధికారిణి, షాద్‌నగర్

సబ్సిడీ వచ్చింది



అధికారులు ఆయిల్ పామ్ సాగు కోసం ప్రోత్సహించడం బాగుంది. ఏడు నెలల క్రితం ఎనిమిది ఎకరాల్లో పంటను సాగు చేశాను. సబ్సిడీపై అధికారులు మొక్కలు, డ్రిప్ ఇచ్చారు. పంట సాగుకు ఖర్చు తక్కువే. అంతర పంటగా పూలు, కూరగాయలు సాగు చేశాను.
– సామ భుజంగరెడ్డి, రైతు, అల్వాల, కేశంపేట

30 ఎకరాల్లో సాగు

గతంలో పత్తి, మొక్కజొన్న తదితర పంటలు సాగు చేసి ఎన్నో ఇబ్బందులు పడ్డాను. ప్రస్తుతం అధికారుల సూచనలు, సలహాలతో 30 ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు చేశాను. మూడు నెలల క్రితం 1,500 మొక్కలు నాటాను. ప్రస్తుతం పంట బాగానే ఉంది.
– అంజనేయులు, రైతు, కందివనం, షాద్‌నగర్

తమ్ముడిని రక్షించబోయి..

ప్రాణం కోల్పోయిన బాలిక • వెనుక నుంచి ఢీకొట్టిన బొలెరో వాహనం



కావ్య (ఫైల్)

షాద్‌నగర్ రూరల్: నాలుగేళ్ల బాబును అపాయం నుంచి రక్షించబోయి.. మరో బాలిక ప్రాణం కోల్పోయింది. ఈ విషాదకర సంఘటన ఫరూఖ్‌నగర్ మండలం అన్నారం పంచాయతీ పరిధిలోని కొండయ్యగడ్డ తండాలో గురువారం చోటుచేసుకుంది. స్థానికులు, కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. కొత్తూరు మండలం ఖాజీగూడతండాకు చెందిన సభావత్ కావ్య (14) తొమ్మిదో తరగతి పూర్తి చేసింది. వేసవి సెలవులు కావడంతో కొద్ది రోజుల క్రితం కొండయ్యగడ్డ తండాలోని బాబాయి కొర్ర పెంట్యానాయక్ ఇంటికి వచ్చింది. వీరి ఇంటి ఎదుట ఉండే సీతారాం కొడుకు చరణ్ బొలెరో వాహనాన్ని వెనక్కి తీస్తున్నాడు. ఈ సమయంలో తన బాబాయి కొడుకు అంకిత్ వాహనం వెనుక ఉండటాన్ని గమనించిన కావ్య వేగంగా వెళ్లి రక్షించే ప్రయత్నం చేసింది. అది గమనించని చరణ్ వాహనాన్ని వేగంగా వెనక్కి నడపడంతో కావ్య తలకు తీవ్ర గాయమైంది. ఆమె చేతుల్లోని అంకిత్ పక్కకు పడిపోయాడు. క్షణాల్లో బాలిక విగత జీవిగా మారడంతో బంధువులు, కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. కాగా, కావ్య తండ్రి రాంజీ గతంలోనే మృతిచెందాడు. తల్లి కవిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వ్యక్తి అదృశ్యం

తలకొండపల్లి: ఐదు రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లిన వ్యక్తి కనిపించకుండా పోయాడు. ఈ ఘటన మండల పరిధిలోని ఖానాపూర్‌లో చోటు చేసుకుంది. ఎస్ఐ శ్రీకాంత్ తెలిపిన ప్రకారం గ్రామానికి చెందిన పెరుమాళ్ల కుమార్(30) ఈ నెల 18న ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు ఎక్కడ వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో గురువారం కుమార్ తండ్రి లక్ష్మయ్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తులో ఉంది.

కారును ఢీకొట్టిన లారీ



నుజ్జునుజ్జయిన కారు

మొయినాబాద్: లారీని రోడ్డు ఎక్కిస్తుండగా కారు నెమ్మదిగా వెళ్తుండడంతో వెనుకనుంచి వేగంగా వచ్చిన మరో లారీ కారును ఢీకొట్టింది. ఈ ఘటనలో కారు నుజ్జునుజ్జయింది. స్థానికులు తెలిపిన ప్రకారం.. షేక్‌పేట్‌కు చెందిన డ్రైవర్ వెంకటయ్య గురువారం కారులో చేవెళ్ల వైపు ప్రయాణిస్తున్నాడు. హైదరాబాద్–బీజాపూర్ జాతీయ రహదారిపై కేతిరెడ్డిపల్లి గేటు సమీపంలో ఓ లారీని రోడ్డెకిస్తుండగా ఆయన కారును స్లో చేశాడు. వెనుక నుంచి వస్తున్న మరో లారీ కారును వేగంగా ఢీకొట్టింది. కారు ముందున్న లారీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారు నుజ్జునుజ్జవ్వగా వెంకటయ్య ప్రమాదం నుంచి బయటపడ్డాడు. ఎటువంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

ఘనంగా అన్నమాచార్య జయంతి

కవాడిగూడ: పదకవితా పితామహుడు అన్నమాచార్య జయంతి వేడుకలను ట్యాంక్‌బండ్‌పై ఉన్న విగ్రహం వద్ద కన్నులపండువగా నిర్వహించారు. గురువారం చిక్కడపల్లి శ్రీ వేంకటేశ్వర ఆలయంలో పూజలు నిర్వహించిన అనంతరం పద్మశ్రీ శోభారాజు తన శిష్య బృందంతో అన్నమయ్య కీర్తనలు ఆలపిస్తూ అన్నమాచార్య విగ్ర హం వరకు ర్యాలీగా చేరుకున్నారు. చిలుకూరి బాలాజీ ఆలయ అర్చకులు రంగరాజన్, శోభారాజుతో కలిసి అన్నమాచార్యులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సేంద్రియ సేద్యం

- రైతుకు, వినియోగదారులకు మేలు
- అవగాహన పెంచుకుంటే లాభాలు
- ప్రత్యేక చర్యలు తీసుకుంటున్న ప్రభుత్వం
- ఏఓ వెంకటేశం



షాబాద్: ప్రస్తుతం రైతులు సంప్రదాయ పద్ధతులకు స్వస్తి పలికి సేంద్రియం వైపు అడుగులేస్తున్నారు. దీంతో నేల సారవంతంగా ఉండడంతో పాటుగా రైతులకు లాభాలు వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుంది. ఇందుకు ప్రభుత్వం సైతం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని ఏఓ వెంకటేశం తెలిపారు.

ఆవుపేడ, మూత్ర ద్రావణం

ఐదు కిలోల ఆవుపేడ, ఐదు లీటర్ల చొప్పున గోమూత్రం, నీటిని ఒక కుండలో లేదా తొట్టిలో మూడింటిని కలియబెట్టాలి. అనంతరం మూత బిగించి మూడు నుంచి నాలుగు రోజుల పాటు మాగబెట్టాలి. రోజుకు ఒకసారి మూత తీసి ద్రావణ మిశ్రమాన్ని కలపాలి. నాలుగు రోజుల తర్వాత బయటకు తీసిన మిశ్రమాన్ని 20 లీటర్ల నీటితో కలపాలి. ఆ తర్వాత ద్రావణాన్ని వడబోసుకుని దానికి 250 గ్రాముల సున్నం కలపాలి. సున్నంతో ఆవు మూత్రంలోని శాతాన్ని తగ్గిస్తోంది. మనం తయారు చేసిన ప్రతీ లీటర్ ద్రావణానికి 10 లీటర్ల నీటిని కలిపి పంటపై పిచికారీ చేయాలి. ఈ ద్రావణంతో పురుగు నాలుగు రోజులపాటు పండువాసన గుర్తుపట్టదు. దీంతో అది పంటపై గుడ్డుపెట్టదు. నారు వరిలో కాండం తొలిచే పురుగును గుడ్డు పెట్టకుండా చూస్తుంది. పంటలకు సూక్ష్మపోషకలోపాలను సైతం సరిదిద్దుతుందని మండల వ్యవసాయ అధికారి వెంకటేశం తెలిపారు.

వేప కషాయం

వేప పండ్లను మే, జూన్ నెలలో సేకరించి నీడలో ఆరబెట్టాలి. తదనంతరం ఎకరాకు ఎనిమిది నుంచి పది కిలోల చొప్పున పండ్లను నీటిలో నానబెట్టి తొక్క వేరుచేయాలి. వాటిని మొత్తగా రుబ్బాలి. నూరిన ముద్దనంతటిని ఒక పలుచని మూటలో వదులుగా కట్టి 10 లీటర్ల నీటిలో నాలుగు గంటల పాటు నానబెట్టాలి. ప్రతీ 20 నిమిషాలకు మూట నుంచి ద్రావాణాన్ని తీయాలి. ద్రావణాన్ని పలుచడి గుడ్డతో వడకట్టాలి. ఇలా తీసిన కశాయానికి 100 గ్రాముల సర్ఫ్ లేదా సబ్బు పొడి కలపాలి. దీంతో ద్రావణం పంటపై చల్లే ప్రక్రియ సులువవుతోంది. ఇది ఆహారాన్ని తినకుండా, ముట్టుకుండా చూస్తుంది. పూతదశలో పూతపైన, ఆకులపైన పురుగులు పెట్టిన గుడ్లను పగలకుండా చూసి ఆగుడ్డు దశలోనే పురుగును చంపుతుంది.



పత్తి పంటకు వేపనూనె పిచికారి చేస్తున్న రైతులు (ఫైల్)

వేపనూనె

వేప నూనె నీటిలో కరగదు. లీటర్ నీటికి ఐదు లీటర్ల చొప్పున వంద లీటర్ల ద్రావణాన్ని తయారు చేసుకోవాలి. ఈ ద్రావణాన్ని వంద గ్రాముల సబ్బు పొడిని కలపాలి. దీన్ని పిచికారీ చేస్తే రసం పీల్చే పురుగులు, కాయ తొలిదశలో పురుగులు, ఆకు ముడత వంటి చీడపురుగులను నాశం చేస్తుందని. వేపనూనె మార్కెట్‌లోనూ లభిస్తుంది.

వేపపిండి

వేపగింజల నుంచి నూనే తీయగా మిగిలిన పిప్పినే వేపిండి అంటారు. ఈ వేపపిండిలో ఐదు శాతం నత్రజని, ఒక శాతం బాస్పరస్, ఒక శాతం పోటాష్ ఉంటాయి. ఈ వేపపిండిని ఒక ఎకరానికి ఒకటి నుంచి రెండు క్వింటాళ్ల వరకు వేయవచ్చు. ఇది భూమిలోపల కీడు చేసే పురుగుల నిర్మూలిస్తుంది. దుక్కిదున్నే సమయంలో సాలల్లో వేసుకోవాలి. లేదంటే విత్తనాలు నాటకముందు భూమిలో చల్లుకోవాలి.

నేడు మేయర్ ఎన్నిక

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషనన్ పరిధిలో నూతన మేయర్‌ను ఎన్నిక నిర్వహించనున్నారు. దీనికి సంబంధించి అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. శుక్రవారం కార్పొరేషన్ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసి మేయర్‌ను ఎన్నుకోనున్నారు. కార్పొరేషన్ 17వ డివిజన్ కార్పొరేటర్ లతాప్రేమ్‌గౌడ్‌ను ఎన్నుకునేందుకు మొగ్గు చూపుతున్నారు. కార్పొరేషన్ మొదటి మేయర్‌గా బుర్ర మహేందర్‌గౌడ్ ఉన్న సమయంలో 16 మంది కార్పొరేటర్లు కలెక్టర్‌కు అవిశ్వాస తీర్మానంపై లేఖను సమర్పించారు. దీంతో కలెక్టర్ ఆదేశాల మేరకు కమిషనర్ బి.శరత్‌చంద్ర మార్చి 21న బలనిరూపణ చేపట్టారు. అవిశ్వాసం నెగ్గిన కార్పొరేటర్లు మేయర్‌ను గద్దెదించారు. ఇదిలా ఉండగా గురువారం మేయర్ ఎన్నికను ఆపాలని కోరుతూ మాజీ మేయర్ మహేందర్‌గౌడ్, కార్పొరేటర్ సాగర్‌గౌడ్‌లు హైకోర్టును ఆశ్రయించారు. పిటిషన్ వేసి మేయర్ ప్రక్రియను నిలుపుదల చేయాలని కోరారు. కానీ జడ్జి వీరి పిటిషన్‌ను తిరస్కరించారు. దీంతో మేయర్ ఎన్నికకు రూట్ క్లియర్ అయింది.

స్విమ్మింగ్ పోటీల్లో పుల్లారెడ్డి సత్తా

అత్తాపూర్: సికింద్రాబాద్ మున్సిపల్ (వీవీ గురుమూర్తి మెమోరియల్)లో గురువారం పాన్ ఇండియా గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో స్విమ్మింగ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో రాజేంద్రనగర్ సర్కిల్ అత్తాపూర్ బస్తీకి చెందిన గంగిడి పుల్లారెడ్డి (52) 400 మీటర్ల స్విమ్మింగ్ ఈవెంట్‌లో మొదటి స్థానంలో నిలిచి సత్తా చాటారు. స్విమ్మింగ్ ఫ్రీ స్టైల్ 200 మీటర్లు పోటీలో రెండోస్థానంలో నిలవగా, బటర్‌ఫ్లై పోటీలతో మూడో స్థానాన్ని దక్కించుకున్నాడు. పోటీలు ముగిసిన అనంతరం విజేతగా నిలిచిన గంగిడి పుల్లారెడ్డికి పాన్ ఇండియా గేమ్స్ ఫెడరేషన్ ప్రతినిధులు బహుమతి, మెడల్స్ అందజేశారు. ఈ సందర్భంగా స్విమ్మింగ్ గంగిడి పుల్లారెడ్డి మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాల విద్యార్థి స్థాయి నుంచి స్విమ్ చేయడం అలవాటుగా చేయాల్సిన బాధ్యత తల్లిదండ్రులది కూడా అని సూచించారు. గత 30 సంవత్సరాలుగా సరదాగా ప్రారంభించిన స్విమ్మింగ్ ప్రతిరోజు స్విమ్ చేస్తూ దేశంలో స్విమ్మింగ్ పోటీలు ఎక్కడ జరిగిన పోటీలలో పాల్గొంటూ బహుమతులు తీసుకురావడం జరుగుతుందని సాక్షికి వివరించారు.



పుల్లారెడ్డికి మెడల్స్, సర్టిఫికెట్ అందజేస్తున్న పాన్ ఇండియా ప్రతినిధులు

సర్వరోగ నివారిణిగా సహకరించడంతో పాటు శారీర దృఢత్వానికి మనము అనుకున్న సంకల్పానికి దగ్గరగా చేస్తుందని పుల్లారెడ్డి తెలిపారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్విమ్మింగ్ పూల్‌ను ఏర్పాటు చేసి విద్యార్థులకు స్విమ్మింగ్ నేర్పించే అవకాశాన్ని రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించాలని ఈ మేరకు క్రీడారంగంలో మంచి ప్రావీణ్యం ఉన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని త్వరలో కలుస్తామని ఈ సందర్భంగా వివరించారు.

అక్రమ నిర్మాణాల అంతు తేలుస్తాం

- మణికొండ, నార్సింగి మున్సిపల్ కమిషనర్లు
- మొదలైన కూల్చివేతల పర్వం

మణికొండ: మున్సిపాలిటీల పరిధిలో తీసుకున్న అనుమతులకు భిన్నంగా ఇష్టారాజ్యాగా, అనుమతులు లేకుండా కొనసాగిస్తున్న నిర్మాణాల అంతు తేలుస్తామని నార్సింగి మున్సిపల్ కమిషనర్ టి. ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, మణికొండ మున్సిపల్ కమిషనర్ డి. ప్రదీప్‌కుమార్‌లు పేర్కొన్నారు. గురువారం నార్సింగి మున్సిపాలిటీ, కోకాపేట 250 గజాల లేఅవుట్‌లో హెచ్‌ఎండీఏ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులతో కలిసి నిర్మాణంలో ఉన్న అదనపు అంతస్తుల నాలుగు భవనాల స్లాబులను కూల్చివేశారు. మణికొండ మున్సిపాలిటీ అలకాపూర్‌టౌన్‌షిప్ రోడ్డు నెంబర్ 29లో నిర్మాణంలో ఉన్న మూడు భవనాలను మున్సిపాలిటీ టౌన్‌ప్లానింగ్ అధికారి సంతోష్‌సింగ్ ఆధ్వర్యంలో కూల్చివేశారు. ఈ సందర్భంగా కమిషనర్లు మాట్లాడుతూ మున్సిపాలిటీలలో తీసుకున్న అనుమతుల మేరకే నిర్మాణాలు చేపట్టాలన్నారు. అదనంగా అంతస్తులు వేయాలంటే హెచ్‌ఎండీఏ నుంచి టీడీఆర్‌లు కొనుగోలు చేసి నిబంధనల ప్రకారం నిర్మాణాలు చేసుకోవాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా చేపట్టే నిర్మాణాలను తప్పనిసరి కూల్చివేస్తామన్నారు. కోకాపేటలో జీ ప్లస్ రెండు అంతస్తులకే అనుమతులు తీసుకుని ఏకంగా ఏడు, ఎనిమిది అంతస్తుల భవనాలు వెలుస్తున్నాయన్నారు. అలాంటి వాటికి నోటీసులు జారీ చేయటంతో పాటు మున్సిపాలిటీ పరిధిలో వెలసిన అక్రమ నిర్మాణాలన్నింటిపై హెచ్‌ఎండీఏ ఎన్‌ఫోర్స్‌మెంట్‌కు చర్యలు తీసుకోవాలని లేఖ రాశామన్నారు. తమ లేఖకు స్పందించి వారు కూల్చివేతలు మొదలు పెట్టారని నార్సింగి కమిషనర్ స్పష్టం చేశారు. రాబోయే రోజుల్లోను కూల్చివేతలు కొనసాగుతాయని ఇద్దరు కమిషనర్‌లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో నార్సింగి టౌన్‌ప్లానింగ్ అధికారి మణిచందన, ఆర్ఐ మోహన్‌రావు, హెచ్‌ఎండీఏ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్సై సంతోష్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.



కోకాపేటలో అదనపు అంతస్తులను కూల్చి వేయిస్తున్న అధికారులు

యథేచ్ఛగా భూ కబ్జా!

- రూ.60 కోట్ల విలువైన భూమి అన్యాక్రాంతం
- సేల్ డీడ్‌లు, నోటరీలుగా అమ్మకం
- దర్జాగా అక్రమ నిర్మాణాలు
- అక్రమార్కులతో అధికారుల కుమ్మక్కు
- ప్రభుత్వ భూములు కాపాడాలని డిమాండ్

మణికొండ: అది ప్రభుత్వ భూమి.. అందున అక్కడ గజం రూ. 80 వేల నుంచి లక్ష వరకు పలుకుతోంది. దీంతో ఆ భూమిపై అక్రమార్కుల కన్ను పడింది. దీనికి అధికారుల సహకారం కూడా తోడుకావటంతో ఇంకేముంది ఇష్టారీతిన నోటరీల రూపంలో స్థలాలను అమ్మకాలు కూడా చేపట్టారు. అయితే ఏది ప్రభుత్వ భూమో.. ఏది లేఅవుట్ చేసిన ప్లాటో తెలియని పేద, మధ్య తరగతి ప్రజలు తక్కువ ధరలకే వస్తుందని కొనుగోలు చేసి నిర్మాణాలు కూడా చేపడుతున్నారు. అలా కొనుగోలు చేసిన స్థలాలో గృహాలు, ప్రహరీలు, గదులు నిర్మాణాలు చేస్తున్నారు. కొన్నింటికి ఏకంగా మున్సిపాలిటీ నుంచి అనుమతులు తీసుకున్నట్టు సమాచారం. గతంలో పనిచేసిన రెవెన్యూ, మున్సిపాలిటీ అధికారులు అక్రమార్కులతో చేతులు కలిపి యథేచ్ఛగా ప్రభుత్వ భూమికి ఎసరు పెట్టారని స్థానికులు ఆరోపిస్తున్నారు. పూర్తి వివరాల్లోకి వెళితే... గండిపేట మండలం, పుప్పాలగూడ రెవెన్యూ పరిధిలో సర్వేనెంబర్ 116 నుంచి 118, 136 నుంచి 143ల వరకు బయోడ్‌కాలనీ లేఅవుట్ చేశారు. దాని పక్కనే సర్వే నెంబర్ 146లో 15 గుంటలు, 147, 148లలో రెండు ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఇవే ప్రభుత్వ సర్వే నెంబర్‌ల నుంచి పండెన్‌వాగు నాలా ప్రవహిస్తుంది. అప్పట్లో ప్రభుత్వ భూమిని వదిలి మిగతా పట్టా భూమిలో బయోడ్ కాలనీ లేఅవుట్ వేయటంతో అందులో అనేకమంది ప్లాట్లను కొనుగోలు చేసి గృహాలు, అపార్ట్‌మెంట్లను నిర్మించుకున్నారు.

ప్రభుత్వ భూమిపై అక్రమార్కుల కన్ను

బయోడ్‌కాలనీ పక్కనే ఉన్న ప్రభుత్వ భూమిపై కొందరు అక్రమార్కుల కన్ను పడింది. బయోడ్ కాలనీ సర్వే నెంబర్‌లతోనే అప్పటి యజమానుల వారసులతో ప్రభుత్వ భూమిని రిజిస్ట్రేషన్‌లు చేసి అమ్మకాలు సాగించారు. తక్కువ ధరలో వస్తుండటం, అభివృద్ధి చెందిన కాలనీ కావటంతో అనేక మంది కొనుగోలు చేశారు. దీంతో అక్రమార్కులు అప్పనంగా కోట్ల రూపాయలను దండుకున్నారు. అందులో అప్పటి రెవెన్యూ అధికారులకు వాటాలు ఇవ్వటంతో వారు మిన్నకున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. దాంతో అక్రమార్కుల ఆగడాలు జోరుగా సాగాయని కాలనీవాసులు పేర్కొన్నారు. ఇదే తరహాలో నెక్నాంపూర్ రెవెన్యూ పరిధిలోని సర్వేనెంబర్ 20లోనూ ఉన్న ప్రభుత్వ భూమిని అమ్మకాలు చేపట్టారు. అక్కడా నిర్మాణాలు కూడా వెలుస్తున్నాయి. రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు ఉండటంతో మున్సిపాలిటీ వారు భూమి వివరాలను పట్టించుకోకుండా నిర్మాణాలకు అనుమతులు ఇస్తున్నారు. అంతేకాకుండా వెంకటేశ్వర కాలనీలోని పార్కు స్థలాలను ఇష్టారాజ్యంగా అమ్మకాలు చేయటంతో వాటిల్లో నిర్మాణాలు వెలుస్తున్నాయి. ఈ విషయం గతంలో 'సాక్షి' దినపత్రిక ప్రముఖంగా ప్రచురించటంతో కొన్ని పార్కులతో పాటు సర్వే నెంబర్ 20లోని కొంత ప్రభుత్వ భూమిని అప్పటి ఆర్‌డీఓ చంద్రకళ పరిరక్షించారని ఆ కాలనీ వాసులు తెలిపారు.

క్రమబద్ధీకరణకు దరఖాస్తులు

ప్రభుత్వ భూమిలో వెలసిన అక్రమ నిర్మాణాలను గత ప్రభుత్వం రెగ్యులరైజ్ చేసేందుకు జీవో 58, 59లు తేవటంతో బయోడ్‌కాలనీ పక్కన ప్రభుత్వ భూమిని కొనుగోలు చేసిన పలువురు విషయం తెలుసుకుని రెగ్యులరైజేషన్‌కు పెట్టుకున్నట్టు తెలిసింది. ప్రధాన రోడ్డుకు ఉన్న ప్రభుత్వ భూమిలో యథేచ్ఛగా షాపులు నిర్మించుకుని మున్సిపాలిటీకి పన్నులు చెల్లించి, విద్యుత్ మీటర్లు తీసుకుని మరీ క్రమబద్ధీకరణకు పెట్టుకున్నట్టు సమాచారం. గతంలో పలుమార్లు రెవెన్యూ అధికారులు ఇక్కడ వెలిసిన షాపులను తొలగించారు. తిరిగి అక్కడే నిర్మించుకుని ఈసారి క్రమబద్ధీకరణకు పెట్టుకున్నట్టు తెలిసింది. ఇలాంటి ప్రభుత్వ భూములను పరిరక్షించేందుకే ప్రజలు చెల్లించే పన్నుల నుంచి జీతాలు తీసుకుంటున్న అధికార యంత్రాంగం చేష్టలుడిగి చూడటంతో పాటు అక్రమార్కులతోనే చేతులు కలిపి వారికి అండదండలు అందిస్తున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా జిల్లా కలెక్టర్ శశాంక, రాజేంద్రనగర్ ఆర్‌డీఓ వెంకట్‌రెడ్డిలు స్పందించి ప్రభుత్వ భూమిలో వెలసిన నిర్మాణాలను తొలగించి పరిరక్షించాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

వెంటనే చర్యలు తీసుకుంటాం



సర్వేనెంబర్ 146, 144లలోని ప్రభుత్వ భూమిలో వెలిసిన నిర్మాణాలపై వెంటనే చర్యలు తీసుకుంటాం. అందులో కొందరు క్రమబద్ధీకరణకు దరఖాస్తులు పెట్టుకున్నారు. వాటి వివరాలను పరిశీలించి క్రమబద్ధీకరణ కానివి, ఆక్రమణలో ఉన్న వాటిపై చర్యలు చేపడతాం. ఇప్పటికే రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌లకు ప్రతి ప్లాట్ వారి వివరాలను తీసుకుని, ప్రభుత్వ భూమిని గుర్తించి, నోటీసులు జారీ చేసి చర్యలు చేపట్టామని ఆదేశించాను.

– ఎస్. శ్రీనివాస్‌రెడ్డి , తహసీల్దార్, గండిపేట



ప్రభుత్వ భూమిలో వెలుస్తున్న ప్రహరీలు, గోదాంలు

జూ పార్క్‌లో మిల్లెట్స్ వైవిధ్య ప్రదర్శన

ఏజీవర్సిటీ: ప్రపంచ జీవవైవిధ్య దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లోని ఐసీఏఆర్–ఐఐఎంఆర్ సంయుక్తంగా నెహ్రూ జూలాజికల్ పార్క్‌లో మిల్లెట్స్ వైవిధ్యాన్ని ప్రదర్శించడానికి ఐసీఏఆర్ (ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మిల్లెట్స్ రీసెర్చ్ హైదరాబాద్ ద్వారా స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. దీనిలో మిల్లెట్స్ సాగు, ప్రాసెసింగ్ కోసం అభివృద్ధి చేసిన సాంకేతికతలు ప్రచురణలతో పాటు ప్రత్యక్ష నమూనాలు, మిల్లెట్స్ ఆధారిత ఉత్పత్తులను ప్రదర్శించారు. ఇందులో జూపార్క్‌కు వచ్చిన సందర్శకులకు మిల్లెట్స్ వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలు, పర్యావవరణ ప్రయెజనాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఐఐఎంఆర్ తరపున అసిస్టెంట్ చీఫ్ టెక్నికల్ ఆఫీసర్ డాక్టర్ మహేష్‌కుమార్, సి. తారా సత్యవతి, దయాకర్‌రావు, జూపార్క్ డిప్యూటీ క్యూరేటర్ నాగమణి, విద్యాధికారి దీపక్ తరుణ్ తదితరులు పాల్గొన్నారు.